క్లుప్తంగా

పారిశుద్ధ్య స్థితిగతులపై సర్వే



ఆత్మకూరు : మండలంలోని లింగమడుగుపల్లె గ్రామంలోని ఇళ్లలో, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య సౌకర్యాల అంచనాల కోసం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మంగళవారం సర్వే చేశారు. మురికినీటి, ఘనవ్యర్థాల నిర్వహణతోపాటు వ్యక్తిగత మరుగుదొడ్ల పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీఓలు చేతన్‌కుమార్‌రెడ్డి, రవికుమార్, ఏపీఓ కుమార్, శ్రీనివాస్, ఏపీఓ రాజిరెడ్డి, ఎస్‌బీఎం సిబ్బంది ప్రవీణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే పోస్టల్ ఖాతా

పరకాల : ప్రజలకు ఆన్‌లైన్ ద్వారానే పోస్టల్ ఖాతా తెర్చుకునే అవకాశం ఉందని సబ్ డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ (ఏఎస్పీ) కె.హరికృష్ణ, పోస్ట్‌మాస్టర్ కురాకుల మొగిళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల స్కీంలతో ప్రజలకు సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. తపాల శాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రజలు పోస్టాఫీసుకు రాకుండా ఇంటి వద్దనే ఆన్‌లైన్ ద్వారా పోస్టల్ ఖాతా తెరుచుకునే అవకాశాన్ని కల్పించినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి సర్వీస్ రిక్వెస్ట్ రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. సర్వీస్ రిక్వెస్ట్ రాగానే పోస్ట్‌మ్యాన్ ఇంటికి వచ్చి ఖాతా ఓపెన్ చేయడానికి అవసరమైన సలహాలు, సూచలను అందిస్తారని వివరించారు. ఈ అవకావాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అంకితభావంతో పనిచేయాలి

భీమదేవరపల్లి : ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది అంకితభావంతో పని చేయాలని డీఈ సామ్యానాయక్ కోరారు. మండలంలోని కొత్తకొండ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. లోవోల్టేజీ సమస్యపై ఆరా తీశాడు. కొత్తకొండ సెక్షన్ పరిధిలోని గ్రామాల్లో గృహ, వ్యవసాయ బావులన్నిటికీ మీటర్ల ద్వారానే విద్యుత్ సరఫరా అవుతోందని ఏఈ శిరీష్‌కుమార్ వివరించారు. విద్యుత్ సిబ్బందిని డీఈ అభినందించారు.

'దాడులను ఉపేక్షించం'

శాయంపేట : కాంగ్రెస్ నాయకులపై భౌతిక దాడులను ఉపేక్షించమని యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు మారపల్లి కట్టయ్య తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు తోట పవన్‌పై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడాన్ని కట్టయ్య ఖండించారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గుండాల మాదిరిగా వ్యవహరించారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు రజనీకాంత్, సుకుమార్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నడికూడ : మండల కేంద్రానికి చెందిన గోనెల బాబు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నాగుర్ల యువజన నాయకులు మంగళవారం ఆర్థికసాయం అందించారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ రైతు విభాగం అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, నాయకులు లోకటి నగేష్, శ్రీను, తాళ్ల రవి, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సఫాయి కుటుంబానికి..

మండలంలోని నర్సక్కపల్లె గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సఫాయి కార్మికుడు కొడెపాక మురళీ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, ఐలయ్య, రవీందర్, రవి, రమేష్, సురేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతకు జరిమానా, ఏడాది ఖైదు

భీమదేవరపల్లి : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తికి రూ.10 వేలు జరిమానాతోపాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి జయలక్ష్మి తీర్పు ఇచ్చారు. ఈ మేరకు వంగర ఎస్సై మౌనిక మీడియాకు మంగళవారం వివరాలు వెల్లడించారు. 2021లో వంగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళపల్లి స్టేజి వద్ద ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన ఎండీ అసిఫ్ అలీ గంజాయితో పోలీసులకు పట్టుబడ్డాడు. అతడ్ని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా జడ్జి విచారించారు. సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం ఆసిఫ్ అలీకి శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. గంజాయి విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్సై పేర్కొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : భూపాలపల్లిలోని అంబేడ్కర్ స్టేడియంలో ఈనెల 23న తలపెట్టిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను కోరారు. కేటీఆర్‌ను కాబోయే సీఎంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అభివర్ణించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, చైర్‌పర్సన్ జ్యోతి మాట్లాడారు. ఈనెల 23న భూపాలపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు కేటీఆర్ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. అనంతరం అంబేద్కర్ స్టేడియంలో సభ ఉంటుందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లత లక్ష్మారెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి నందం, సర్పంచ్ కందగట్ల రవి, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.

'కేంద్ర' నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న శ్రీరామ్ చక్రవర్తి



శాయంపేట : మాట్లాడుతున్న ఆర్.మొగిళి

● బీజేపీ నేత బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ నేత, మాజీ హౌజ్‌ఫెడ్ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తెలిపారు. మండలంలోని సూరారం గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి చక్రవర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లు, సీసీ రోడ్లు, రైతు వేదికలు, వైకుంఠ ధామాల నిర్మాణం కేంద్రం విడుదల చేసిన నిధులతోనే చేపట్టారని చెప్పారు. కరోనా నేపథ్యంలో రాష్ట్రంలో మూడేళ్లుగా ఉచితంగా రేషన్ బియ్యం అందజేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబపాలన సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జనగాని కిష్టయ్య, పెరుకు మధు, కంచర్ల శంకరయ్య, చిదురాల వెంకటేష్, అంచనగిరి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరు మోసపూరితం

శాయంపేట : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిళి తెలిపారు. మండలంలోని కాట్రపల్లిలో శక్తి కేంద్ర ఇన్‌చార్జీ కొత్తపల్లి శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి మొగిళి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక నీళ్లు, నిధులు, నియామకాలను విస్మరించారని తెలిపారు. సమావేశంలో బూత్ కమిటీ అధ్యక్షుడు జంగా సదయ్య, సంతోష్, శంకర్, విద్యాసాగర్, దేవరాజ్, మహేష్, నాగరాజు, రాజు, శేఖర్, సుమన్, సాంబయ్య, ఐల్లయ్య, రాజు పాల్గొన్నారు.

'ఉపాధి' పథకాన్ని వినియోగించుకోవాలి



భీమదేవరపల్లి : మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

భీమదేవరపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ శ్రీనివాసకుమార్ కోరారు. మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలో జరుగుతున్న ఈజీఎస్ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కూలీలు ఆధార్ నెంబర్ లింక్ చేసుకున్న బ్యాంకు ఖాతాకు జాబ్ కార్డును అనుసంధానం చేసుకోవాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 'మన ఊరు–మన బడి' పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఆయన వెంట ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ కుమారస్వామి, సర్పంచ్ వేల్పుల రవి, ఎఫ్ఏ చిదురాల కుమారస్వామి ఉన్నారు.

జాబ్ కార్డును అనుసంధానం చేసుకోండి

నడికూడ : ఉపాధి హామీ కూలీలు ఆధార్ కార్డు లింకైన బ్యాంకు ఖాతాకు జాబ్‌కార్డును అనుసంధానం చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ నీరటి రాములు కోరారు. మండల కేంద్రంలోని పెద్చెరువులో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ నీరటి రాములు మాట్లాడారు. వారంలో జరిగిన పనికి కొలతల ప్రకారం కూలీ వచ్చేలా చూస్తామని తెలిపారు.

'కేంద్రం' తీరుతో ప్రభుత్వ సంస్థలు నిర్వీర్యం

ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యమౌతున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్ ఆందోళన వెలిబుచ్చారు. తద్వారా లక్షలాది మంది ప్రజల జీవనాధారంపై దెబ్బపడుతోందని చెప్పారు. మండలంలోని జీల్గుల గ్రామంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శాఖ నిర్మాణ మహాసభకు లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇతర అంశాలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం నివేశన స్థలాలకు పట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శాఖ కార్యదర్శిగా వేముల కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా పబ్బు రవి, ఆరెల్లి మహేందర్‌తోపాటు మరో 15 మందితో కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, నాయకులు మర్రి విజయ్, నిమ్మల మనోహర్, మర్రి శ్రీనివాస్, మండల కార్యవర్గ సభ్యులు ఆరేల్లి చంద్రమౌళి, దివ్యభారతి, జానమ్మ, కనకరత్నం పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వంగ రవి

భీమదేవరపల్లి : హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, వరంగల్ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ సహకారంతో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తానని జెడ్పీటీసీ వంగ రవి తెలిపారు. మండలంలోని ముల్కనూర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు అనేక ఏళ్లుగా ఇళ్ల స్థలాలు, ప్రెస్ క్లబ్ భవనం, తదితర సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధులు సైతం ఇచ్చేందుకు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలను ఎమ్మెల్యే సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి సురేందర్, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి మల్లిఖార్జున్, ప్రచార కార్యదర్శి విజయ్‌కుమార్, అజయ్‌కుమార్, బాలాజీ, కిశోర్, ఐలయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు

హన్మకొండ కల్చరల్ : హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు ప్రణవ్, మేఘనాథ్ ఉదయం ఉత్సిష్ట గణపతికి ఆరాధన, రుద్రేశ్వరునికి ఏకవార రుద్రాభిషేకం, ఆలయ ప్రాంగణంలోని క్షేత్రపాలకుడైన ప్రసన్నాంజనేయ స్వామికి అభిషేకం, చందనపూజ, ఆకుపూజ, వడమాలధారణ, నూతన వస్త్రాలంకరణ, షోడశోపచారపూజ, మహాహారతి, మహామంత్రపుష్పం నిర్వహించారు. యాగశాలలో గణపతి నవగ్రహ రుద్ర హోమం జయాదిహోమాలు జరిపి మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను నందివాహనంపై ప్రతిష్ఠించి ఆలయం నుంచి రాగన్నదర్వాజ వరకు ఊరేగించారు. ఆఫీసర్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ ప్రముఖ ఆధ్యాత్మిక దొంతి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్న ప్రసాదాల వితరణ జరిగింది. కార్యక్రమాల్లో రుద్రేశ్వరసేవా సమితి సభ్యులు రావుల సుదర్శన్, పులగంధం రాజారాం సేవలందించారు. బ్రహ్మోత్సవాలను ఆలయ ఈఓ శేషగిరి పర్యవేక్షించారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం



పరకాల : నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలకంటి రాములు తెలిపారు. పట్టణంలోని స్వర్ణగార్డెన్‌లో సంఘం డివిజన్ కమిటీ అధ్యక్షుడు చెన్న సదానందం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఎలకంటి రాములు, రాష్ట్ర కార్యదర్శి సముద్రాల విజేందర్ పర్యవేక్షణలో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. పరకాల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ముల్కనూరి రాములు, చెన్న మహేందర్, గౌరవ అధ్యక్షుడుగా కురిమిండ్ల రవీందర్, కోశాధికారిగా ముల్కనూరి రఘులను ఎన్నుకున్నారు. నడికూడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చెన్న ఉమాపతి, మాచర్ల రాజు, కోశాధికారిగా చెన్న కుమారస్వామిలను ఎన్నుకున్నారు. అనంతరం రాములు మాట్లాడారు. బ్యాంకు ఋణాల ద్వారా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యురాలికి అవార్డు



పరకాల : కరోనా మొదటి వేవ్ సమయంలో అవిశ్రాంతంగా 3 నెలలపాటు పేదలకు సేవలు అందించినందుకు గాను స్థానిక మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు ముఫీనా ఫాతిమాకు ప్రముఖ సినీ నటుడు రజనీకాంత్ చేతుల మీదుగా ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు–2023 లభించింది. జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి విస్టం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో అవార్డులు అందజేశారు. సామాజిక సేవా దృక్పథంతో సొంత ఖర్చుతో పేదలకు భోజనం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు పేద వృద్ధురాలి అంత్యక్రియలు నిర్వహించినందుకు ఆమెకు అవార్డు అందించినట్టు నిర్వాహకులు తెలిపారు. ముఫీనా ఫాతిమాను పలువురు అభినందించారు.

ఎమ్మెల్యే గండ్ర నివాళి



శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పెంబర్తి సాంబయ్య తండ్రి కొమురయ్య మృతదేహానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నివాళులర్పించారు. కొమురయ్య మృతి చెందిన విషయం తెలిసి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సింగారం గ్రామానికి చేరుకుని సాంబయ్యను పరామర్శించారు. అనంతరం కొమురయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంబర్తి సంతోష మల్లేష్, ఉపసర్పంచ్ సతీష్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి పెంబర్తి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెంచాలని వినతి

కేయూ క్యాంపస్ : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలను పెంచాలని ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డికి తెలంగాణా ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ జనరల్‌సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ ఇతర బాధ్యులు మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు 30 శాతం వేతనాలు పెరిగాయని కాని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు వేతనాలను పెంపుదల చేయలేదన్నారు. స్పందించిన రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కలిసిన వారిలో ఆ అసోసియేషన్‌బాధ్యులు ఆర్‌డిప్రసాద్, మధుకర్‌రావు, చీకటిశ్రీనివాస్, శ్రీదేవి, కవిత, టి స్వప్న ఉన్నారు.

మాతృభాషతో వ్యక్తిత్వానికి పరిపూర్ణత



పరకాల : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంతోష్



శాయంపేట : ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

● డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

పరకాల : మాతృభాష ద్వారానే పరిపూర్ణమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అమ్మ నుంచి ఉగ్గుపాలతో నేర్చుకునే కమ్మనైనదిగా మాతృభాషను అభివర్ణించారు. వ్యక్తులు పరిపూర్ణత సాధించడానికి మాతృభాష తోడ్పడుతుందని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ మాతృభాషను గౌరవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.నవీన్, అశోక్ మోరె, డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ ఎల్.ఇందిరదేవి, డాక్టర్ వి.రాజయ్య, డాక్టర్ జి.స్వప్న, టి.రాజు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ, మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే (ఎంజేపీ) వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో మాతృభాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి చదువుల తల్లి సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి మాతృభాషా దినోత్సవ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఎంజేపీలో విద్యార్థులు 'భువన విజయం' ప్రదర్శన నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

ఎల్కతుర్తి : ప్రజలు చైతన్యవంతం కావడం ద్వారా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని సీఐ శ్రీనివాస్ కోరారు. వరంగల్ నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు మండలంలోని కోతులనడుమ గ్రామంలో జాగృతి కళాబృందం స్థానిక ఎస్సై పరమేష్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడారు. మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనల అమలు, డయల్ 100, బాల్యవివాహాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, గుట్కా, గంజాయ్, మాదకద్రవ్యాల వినియోగం, తదితరాలపై కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. మూఢనమ్మకాల నిర్మూలన, మాదకద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయడంలో యువత భాగస్వామ్యం కీలకమన్నారు. సైబర్ నేరాలు, సీసీ కెమెరాలు, ఇతరత్రా అంశాలపై ప్రజలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై జక్కుల పరమేష్, సర్పంచ్ బోయినపల్లి రజిత దేవేందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేలా 'సర్వోదయ' సేవలు



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దామోదర్

ఆత్మకూరు : పేదలను ఆదుకునేలా సర్వోదయ స్వచ్ఛంద సంస్థ సేవలు అందిస్తోందని కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ తెలిపారు. పేదరికం వల్ల చదువు ఆగకూడదని ఆయన ఆకాంక్షించారు. మండలంలోని ఆత్మకూరు, పెద్దాపూర్, అక్కంపేట, అగ్రంపహాడ్ గ్రామాల్లోని 90 మంది పేద విద్యార్థులకు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఒంటారియో టీచర్స్ ఫెడరేషన్ సహకారంతో మంగళవారం ఆయన ఉచితంగా నోట్‌బుక్కులు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడారు. సర్వోదయ సంస్థ 3 దశాబ్దాలుగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలు చేపడుతోందని చెప్పారు. పేదరిక నిర్మూలనతోపాటు మానవ, సహజ వనరుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. పరకాల నియోజకవర్గంలోని 600 మంది పేద విద్యార్థులకు రూ.2 వేల విలువైన స్టడీ కిట్లను పంపిణీ చేశామన్నారు. మరో 126 మంది విద్యార్థులకు రూ.5–10 వేల విద్యారుణాలను వడ్డీ లేకుండా అందించినట్టు వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పేదరికంతో ఉన్నత చదువులు కొనసాగించలేని దుస్థితి నెలకొందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పేదరికాన్ని జయించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, పెద్దాపూర్ సర్పంచ్ సావురే కమల రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీ కమలాపురం రమేష్, హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయుడు రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, సర్వోదయ సంస్థ సభ్యుడు చాపర్తి రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, పుష్పలీల, శ్రీవిద్య, సాజిదా బేగం పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీపై పోరాడాలి : సీపీఎం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చుక్కయ్య, తదితరులు

ఐనవోలు : మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశాన్ని, రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్న బీజేపీపై ప్రజలు పోరాడాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.చుక్కయ్య పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రెడ్ బుక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా భారత విప్లవ కెరటంగా గుర్తింపు పొందిన భగత్‌సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ముల్కలగూడెం సర్పంచ్ బండి పర్వతాలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి చుక్కయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదాన్ని ప్రేరేపించడాన్ని మొదలుపెట్టిందని తెలిపారు. అదానీ, అంబానీ లాంటి సంపన్నులకు ప్రజాధనాన్ని దోచిపెడుతోందని చెప్పారు. భగత్‌సింగ్‌ను అగ్రశ్రేణి స్వాతంత్య్ర సమరయోధులు, విప్లవకారులు, సోషలిస్టుల్లో ఒకరని కీర్తించారు. మార్క్సిస్ట్ సిద్ధాంత ఆలోచనపరుల్లో భగత్‌సింగ్‌ను మొదటి వ్యక్తిగా కొనియాడారు. స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా దేశాన్ని విడిచి ఆంగ్లేయులు వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌పై బాంబు విసిరి మతతత్వానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ పోరాడారని గుర్తు చేశారు. మతోన్మాద పార్టీలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆ పార్టీ మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ యువత భగత్‌సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు గుండెకారి మహేందర్, కొంకల నారాయణరెడ్డి, ధీకొండ ఉప్పలయ్య, కొంకటి శంకర్‌రెడ్డి, మోహన్‌రావు, రాయపురపు కొముర‌య్య, బాబురావు, సలీం, సంతోష్, మచ్చ కుమార్, నాగరాజు, మాజీ సర్పంచ్ మాణిక్యం, సరోజన, సృజన, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతోనే రోడ్ల అభివృద్ధి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అనిత

పరకాల : స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతోనే రోడ్ల అభివృద్ధి జరుగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని 3వ వార్డులో రూ.3 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పట్టణాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కమిషనర్ టి.శేషాంజన్ స్వామి, కౌన్సిలర్ సంతోష్ పాల్గొన్నారు.